క్లుప్తంగా...

వైభవంగా నల్ల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న ఆలయ అధ్యక్షుడు ఆదర్శ మహేశ్, జ్యోతి దంపతులు

గౌలిపురా: గౌలిపురా సీబీబీ క్వార్టర్స్‌లోని నల్ల పోచమ్మ ఆలయం 7వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. శనివారం లక్ష్మీ గణపతి దుర్గ హోమాన్ని ఆలయ అధ్యక్షుడు ఆదర్శ మహేశ్, జ్యోతి దంపతులు, రవి దంపతులు నిర్వహించారు. ఈ హోమంలో కొడి సురేందర్, దయానంద్, నాగరాజు, సుదీర్, సాయి, సూచిత్, అఖిల్ పాల్గొన్నారు.

జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్‌గా రాకేష్ తివారీ



చార్మినార్: సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్‌గా రాకేష్ తివారీ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా కమిటీ నియామకాలు యథావిధిగా లాంఛనప్రాయంగా పూర్తయ్యాయి. ఆలయ కమిటీ వైస్ చైర్మన్‌గా టి.అరవింద్ కుమార్, అధ్యక్షుడిగా ఎ.సుదర్శన్, ఉపాధ్యక్షులుగా వరద రాజ్, శ్రీరాములు చారి, సలహాదారులుగా రంజిత్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా రాజేష్ తివారీ, కోశాధికారిగా ఎ.వేణుగోపాల్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా శశాంక్ తివారీ, నర్సింహ, విక్రం, గౌతం పాండే, నితిన్, ప్రవీన్‌కుమార్, రఘు తదితరులు నియమితులైనట్లు చైర్మన్ రాకేష్ తివారీ తెలిపారు.

ప్రజా ఏక్తా పార్టీని బలోపేతం చేస్తాం



సునీల్ తివారీకి నియామకపత్రం అందజేసిన బోనాల శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: ప్రజా ఏక్తా పార్టీని దేశవ్యాప్తంగా బలోపేతం చేస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు సునీల్ తివారీ సిక్వాల్‌ను రాజస్థాన్ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా నియమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీని దేశవ్యాప్తంగా బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ధర్మేంద్ర తివారీ, రామ్‌సుఖ్ ఓజా, నరేష్ దూత్‌పాల, రాజు సూత్రవ్ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి



సమావేశంలో పాల్గొన్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: మహిళా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ చైర్మన్, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. మహిళల సంక్షేమానికి, మహిళా అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నట్లు ఆయన అన్నారు.

యువ దర్శకులు రావాలి



గన్‌ఫౌండ్రీ: తెలుగు చలనచిత్ర పరిశ్రమలో యువ దర్శకులకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు కె.బాసిరెడ్డి అన్నారు. సిరి ఫిల్మ్ బ్యానర్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పుణ్యానికి దారేది అనే లఘు చిత్రాన్ని ఆయన శనివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మన సాంప్రదాయాలు, ఆచారాలు, మానవతా విలువలు తెలియజేయాలనే ఉద్దేశంతో బాల నటులతో చిత్రాన్ని నిర్మించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు చలన చిత్ర మండలి సభ్యులు కేఎల్.దామోదర్, మల్లికార్జున శర్మ, చిత్ర దర్శకుడు బి.రాజేష్‌కుమార్, సిరి ఫిల్మ్ ఎండీ కె.శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

సప్త బంగారు బోనం

ఏడు అమ్మవారి ఆలయాలకు ఏడు బంగారు పాత్రల్లో నైవేద్యం

- భాజా భజంత్రీల నడుమ ఊరేగింపుగా పట్టు వస్త్రాల సమర్పణ
- జోగిని నిషా క్రాంతి ఎత్తుకోనున్న బంగారు బోనం
- ఈనెల 22న, గోల్కొండ జగదాంబ అమ్మవారికి మొదటి బంగారు బోనం..
- వచ్చే నెల 2న విజయవాడ కనక దుర్గమ్మ తల్లికి..



విజయవాడ కనక దుర్గమ్మ ఆలయ ఈఓకు వినతి పత్రం అందజేస్తున్న నిర్వాహకులు

చార్మినార్: ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల్లో బంగారు బోనంతో పాటు పట్టు వస్త్రాల సమర్పణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఉత్సవాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. భాజా భజంత్రీల నడుమ పోతురాజు ఆటపాటలతో బంగారు పాత్రలో నైవేద్యాన్ని తీసుకెళ్లి పట్టు వస్త్రాలతో పాటు అమ్మవార్లకు సమర్పించనున్నారు. ఏడు అమ్మవారి ఆలయాలను సందర్శించి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించనున్నారు. అందుకే ఈ పూజా కార్యక్రమాలను సప్త మాతృకలకు సప్త బంగారు బోనంగా పిలుస్తారు. ఇందులో భాగంగా వచ్చే నెల 2న, విజయవాడలో బంగారు బోనంతో తెలంగాణ బోనాల జాతర ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ అక్కడి ఈఓ భ్రమరాంబను ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు.



సప్త మాతృకలకు సప్త బంగారు బోనం షెడ్యూల్..

ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా ఈసారి సప్త మాతృకలకు సప్త బంగారు బోనాలను నగరంలోని గోల్కొండ, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ, జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం, విజయవాడ కనక దుర్గమ్మ, చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం, లాల్‌దర్వాజా సింహవాహిని ఆలయం అమ్మవార్లకు సమర్పించడానికి ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.



బంగారు బోనంతో జోగిని నిషా క్రాంతి (ఫైల్)

- ఈసారి ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలు జూన్ 22న గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించే బంగారు బోనంతో ప్రారంభమవుతాయి.
- 27న బల్కంపేట ఎల్లమ్మ తల్లికి బంగారు బోనం
- 30న జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి బంగారు పాత్రలో బోనం
- జులై 2న విజయవాడ కనక దుర్గా అమ్మవారికి ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో బోనాల సమర్పణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. బంగారు పాత్రలో అమ్మవారికి బోనం, పట్టువస్త్రాలు, వడిబియ్యం సమర్పించనున్నారు.
- జులై 6న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బంగారు బోనం
- జులై 11న, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి బంగారు బోనం, పట్టువస్త్రాల సమర్పణ.
- జులై 13న లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారికి బంగారు పాత్రలో బోనం సమర్పించనున్నారు.
- చివరగా మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం అమ్మవారికి ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ తరఫున బంగారు పాత్రలో బోనాన్ని తీసుకొచ్చి సమర్పించనున్నారు.

ముస్తాబవుతున్న పాతబస్తీలోని ప్రముఖ ఆలయాలు..

ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఇప్పటికే పాతబస్తీలో బోనాల సందడి నెలకొంది. ఆయా ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను ఉత్సవాల నిర్వాహకులు అత్యంత సుందరంగా ఆకర్షణీయంగా తీర్చి దిద్దుతున్నారు. ఇందులో భాగంగా లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయం, ఉప్పుగూడ మహంకాళి ఆలయం, గౌలిపురా మహంకాళి మాతేశ్వరీ ఆలయం, సుల్తాన్‌షాహీ జగదాంబ మహంకాళి ఆలయం, మురాద్ మహల్ మహంకాళి ఆలయం, సుల్తాన్‌షాహి బంగారు మైసమ్మ ఆలయం, గౌలిపురా నల్లపోచమ్మ ఆలయం, రాంబక్షి బండ శ్రీ ఆలయం, బేలా ముత్యాలమ్మ ఆలయం, హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయం, హరిబౌలి అక్కన్న మాదన్న ఆలయం, రాంసింగ్‌బాడా శ్రీ బంగారు మైసమ్మ మహంకాళి ఆలయం ఆలయం, మక్థూంపురా ఎల్లమ్మ ఆలయం, సుల్తాన్‌షాహి శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం, గౌలిపురా బంగారు మైసమ్మ ఆలయాలు ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి.

కోట బోనాలు రాష్ట్రానికి తలమానికం

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్



కోటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలు తెలంగాణ రాష్ట్రానికి తలమానికం లాంటివని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన వివిధ పార్టీల నాయకులతో కలిసి కోటలో బోనాల కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనాల నిర్వహణకు తానెప్పుడూ ముందుంటానన్నారు. బోనాల ఏర్పాట్ల నిర్వహణ కోసం తాను వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్నాని ఆయన అన్నారు. అందరి సహకారంతోనే బోనాలు విజయవంతమవుతున్నాయని, ముఖ్యంగా వివిధ శాఖల అధికారులు కష్టపడి బోనాలను ప్రశాంతంగా జరిగేలా చూస్తున్నారని ఆయన అన్నారు. కోట బోనాలు తెలంగాణలో మతసామరస్యానికి అద్దం పడుతాయని, స్థానిక ముస్లింసు బోనాల నిర్వహకులతో పాటు అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సైతం ఎంతగానో సహకరిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్వాన్ ఇన్‌చార్జి టి. జీవన్ సింగ్, జలమండలి డీజీఎం ఖాజా జౌహర్ అలీ, గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవార్ల వృత్తిపని సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి, మహంకాళి ఆలయ పూజారి సురేష్ చారి, శ్రీకాంత్ చారి, మజ్లిస్ నాయకుడు బదర్ ఉద్దీన్, శివశంకర్ తదితరులున్నారు.

గోషామహల్ కాంగ్రెస్ టికెట్ స్థానికులకే కేటాయించాలి



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్‌ను స్థానికులకే కేటాయించాలని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్, స్థానిక నాయకులు సంజయ్‌యాదవ్, శ్రీధర్‌గౌడ్, శ్యామ్ సింగ్, రఘునందన్‌యాదవ్, శంకర్ సింగ్, యోగేందర్, మనోజ్ సింగ్, పరీక్షిత్ యాదవ్ రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో 20, 30 ఏళ్లుగా ఉంటూ స్థానికంగా నివాసం ఉండే వారికే కాంగ్రెస్ టికెట్ కేటాయించాలని అప్పుడు తాము విజయం సాధిస్తామని ఆయన అన్నారు.

మిద్దె పంట సాగు శిక్షణకు విశేష స్పందన

నాంపల్లి: సరైన మెళుకువలు పాటిస్తే మిద్దె పంటపై పోషకాలతో కూడిన ఆకుకూరలు, కూరకాయలను పండించవచ్చని ఉద్యాన శాఖ అధికారులు పేర్కొన్నారు. శనివారం రెడ్‌హిల్స్‌లోని ఉద్యాన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మిద్దె పంటపై కూరగాయల సాగు అనే అంశంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. జంట నగరాలకు చెందిన 72 మంది ఆసక్తిపరులు హాజరై అవగాహన పొందారు. ఏపీ ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వీ రత్నాచార్యులు హాజరై మిద్దె పంటపై కూరగాయలు, పండ్ల సాగును ఎలా చేయాలో వివరించారు. ఇసాయు ఫార్మ్స్ కంపెనీ ప్రతినిధులు హాజరై హైడ్రోఫోనిక్స్ పద్ధతి ద్వారా కూరగాయల సాగుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే మిద్దెపై ముత్యాల సాగు చేసే పద్ధతులను విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.యాదగిరి, మోహన్, ప్రియాంక, ఆంజనేయులు పాల్గొన్నారు.

'ఆత్మ గౌరవ భవనానికి రూ.కోటి మంజూరుకు కృషి'



నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: లోధ్ కులస్తుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం త్వరలోనే కోటి రూపాయలు విడుదల చేసేందుకు తాను కృషి చేస్తానని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ధూల్‌పేటలోని లోధ్ కులస్తుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం భవన నిర్మాణానికి ఇంతకు ముందే స్థలం కేటాయించిందన్నారు. నిర్మాణ పనులకై కోటి రూపాయలు ప్రభుత్వమే అందించే విధంగా తాను కృషి చేస్తానన్నారు. శనివారం నగర బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ దాసోజి శ్రవణ్‌తో కలిసి నందకిశోర్ వ్యాస్ బిలాల్ ధూల్‌పేటలోని లోధ్‌కులస్థుల సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. మంత్రి తలసాని సహకారంతో రాష్ట్ర బీసీ శాఖమంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి లోధ్ కులస్తుల భవనానికి త్వరలోనే కోటి రూపాయలు విడుదలయ్యేలా తనవంతు చర్యలు చేపడుతానన్నారు.

ఛత్రినాక ఠాణా పరిధిలోనే ఉప్పుగూడ ఉండాలి



ఉప్పుగూడ నుంచి నిరసన కార్యక్రమానికి వెళ్తున్న నాయకులు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ రైల్వే పట్టాల దిగువన ఉన్న ప్రాంతాన్ని ఛత్రినాక పోలీస్‌స్టేషన్ నుంచి విడదీసి చాంద్రాయణగుట్ట ఠాణాలో కలపడాన్ని నిరసిస్తూ ఆందోళనలకు సిద్ధమైన స్థానిక నాయకులతో పోలీసు ఉన్నతాధికారులు శనివారం చర్చలు జరిపారు. తమ ప్రాంతానికి ఎంతో దూరంగా ఉన్న చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌కు ఎలా కలుపుతారంటూ ఛత్రినాక చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపడుతామంటూ నాయకులు తాడెం శ్రీనివాసారావు, జమ్మిచెట్టు రాజు, ధరంకార్ రాజేందర్, మధుసూదన్ గౌడ్ ఉప్పుగూడ జెండా నుంచి బయల్దేరారు. ఈ మేరకు ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ భోజ్యా నాయక్ నాయకులను సముదాయించి ఉన్నతాధికారులను రప్పిస్తామని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, ఫలక్‌నుమా ఏసీపీ షేక్ జహంగీర్‌లు ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని నాయకుల అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. అభ్యంతరాలతో కూడిన వినతిపత్రాన్ని నాయకులు డీసీపీకి అందజేశారు.

అలరించిన వసంతరాగాలు

నాంపల్లి: శ్రీ రాగరమ్య సంస్థ ఆధ్వర్యంలో వసంత రాగాలు శీర్షికన ప్రదర్శించిన నృత్యగాన సమ్మేళనం అలరించింది. ఈ కార్యక్రమం శనివారం మధ్యాహ్నం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళా మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు తమ ప్రతిభను ఎంతో ఆహ్లాదకరంగా ప్రదర్శించారు. హాస్య బ్రహ్మ డాక్టర్ శంకర నారాయణ, సామాజిక కార్యకర్త జ్యోతి పూజారి, గ్రామీణ భారతి(ఎన్.జి.ఓ) కార్యదర్శి సూర్యకళ, సరిత కృష్ణ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సరిత కృష్ణ అతిథులుగా హాజరై అభినందించారు. నృత్య సంగీత గురువులు శిరీషదేవి, మాధురి, సౌమ్య, లక్ష్మి, అపర్ణ, భరణిను గురు సత్కారంతో సత్కరించారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలని హాస్యబ్రహ్మ డాక్టర్ శంకర నారాయణ అన్నారు. అనంతరం అంధ కళాకారుడు ప్రదర్శించిన తబలా విన్యాసం ప్రేక్షకులను అలరించింది.



ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ రేణుకా యారా

యాకుత్‌పురా: న్యాయ వ్యవస్థ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ రేణుకా యారా సూచించారు. శనివారం పురానీహవేలిలోని సిటీ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కక్షిదారులకు ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రజలకు సత్వరమే న్యాయం అందించేందుకు లోక్ అదాలత్‌లను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. లోక్ అదాలత్‌లో నిజమైన కక్షిదారులకు ఉచితంగా సత్వరమే న్యాయ పరిష్కారం జరుగుతుందన్నారు. మొత్తం ఈ లోక్ అదాలత్‌లో 9 ప్రత్యేక బెంచ్‌లను ఏర్పాటు చేసి కుటుంబ తగాదాలు, బ్యాంక్ లావాదేవీలు, మోటార్ వాహన ప్రమాదాలు, భూ ఆస్తి తగాదాలు తదితర అంశాల్లో 2747 కేసులను పరిష్కరించి బాధితులకు రూ.42,65,08,275 నష్ట పరిహారాన్ని నిర్ణయించామని సిటీ సివిల్ కోర్టు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కళార్చన తెలిపారు. ఈ లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈ లోక్ అదాలత్‌లో అదనపు చీఫ్ జడ్జిలు సరిత, దాని రూత్, జడ్జిలు భవానీ, రాధికా, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తలసానికి అమ్మవారి జ్ఞాపిక అందజేత



గోల్కొండ: గోల్కొండ జగదాంబి మహంకాళి అమ్మవార్ల ఆషాఢ బోనాల జాతర నిర్వహణ ఏర్పాట్లను సీఎం కేసీఆర్ తనకు అప్పజెప్పడం తన అదృష్టమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కోట బోనాల ఏర్పాట్ల సమీక్ష సమావేశానికి శనివారం ఆయన గోల్కొండ కోటకు వచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బి. సాయిబాబాచారి ఆయనకు అమ్మవార్ల చిత్రాలు గల జ్ఞాపికను అందజేశారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగబాల సురేష్‌కుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: నేటి యువత హింసాత్మక ప్రేమకు స్వస్తి పలకాలని పలువురు వక్తలు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో ప్రముఖ రచయిత చల్లా భానుకిరణ్ రచించిన 'నిన్ను నాకిచ్చేసేయ్'ప్రేమ కవితల పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు టెలివిజన్ రచయితల సంఘం అధ్యక్షులు నాగబాల సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రేమలో మానవత్వం ఉండాలి కానీ ఉన్మాదం ఉండకూడదన్నారు. అనంతరం కిసాన్ పరివార్ అధినేత భూపాల్ నాయక్‌కు రైతుబంధు అవార్డును ప్రదానం చేయడంతో పాటు కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రులు జ్వలిత, చల్లా సరోజిని దేవి, కవయిత్రి తాటికొండ కళ, సినీ గేయ రచయిత రాంబాబు పాల్గొన్నారు.

కోటలో ప్రత్యేక పూజలు



పూజల్లో జీవన్ సింగ్ తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలు తెలంగాణ షాన్ అని కార్వాన్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి. జీవన్ సింగ్ అన్నారు. ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గోల్కొండ కోట బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా గోల్కొండ కోటలో అమ్మవార్లకు జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి గతంలో కంటే భారీ ఎత్తున బోనాలు నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. బోనాల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించడానికి ప్రత్యేక కమిటీని వేస్తున్నట్లు ఆయన తెలిపారు. వృత్తిపని సంఘం అధ్యక్షుడు బి. సాయిబాబాచారి, పూజారి సురేష్ చారి, వివిధ రకాల వృత్తిపనివారు పాల్గొన్నారు.

ఆలోచింప చేసేలా 'బడిబాట'



బడిబాట కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య తదితరులు

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో శనివారం ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన 'బడిబాట'కార్యక్రమం ఆలోచింప చేసింది. చదువు ప్రాధాన్యాన్ని తెలుపుతూ బ్యానర్లు, ప్లకార్డులతో అవగాహన ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపాలని కోరారు. విజయనగర్‌కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్నట్లు తెలిపారు. సత్యవల్లి, శ్రీశైలం, నర్సింగ్‌రావు, సురేష్‌కుమార్, సౌభాగ్యరత్నం, సుమలత, ఫిజికల్ టీచర్ మధుప్రసాద్ పాల్గొన్నారు.

అగర్వాల్ సమాజ్ సేవలు అభినందనీయం



వైద్య శిబిరంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: చేప ప్రసాదం కోసం వచ్చేవారికి 24 గంటల పాటు అల్పాహార భోజన సౌకర్యాలను కల్పించడం ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆహార పంపిణీ కేంద్రాన్ని 2వ రోజు అయిన శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు లక్ష మందికి పైగా భోజన, తాగునీరును అందించడం మంచి విషయమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అంజనీకుమార్ అగర్వాల్, ఉపాధ్యక్షుడు దిలీప్‌కుమార్, సతీష్‌కుమార్ అగర్వాల్, రాకేష్ కుమార్, సంజయ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులవృత్తుల ఆర్థిక సాయంలో నిబంధనలను సడలించాలి



మాట్లాడుతున్న మదన్‌మోహనాచారి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కులవృత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం నిబంధనలను సడలించాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సంఘం కోరింది. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్‌చారి మాట్లాడుతూ.. కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తరతరాలుగా చేతివృత్తులను చేసుకుంటూ జీవనం సాగిస్తున్న విశ్వకర్మలకు తగిన న్యాయం చేయాలని, అదేవిధంగా ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేలా సమయాన్ని పొడిగించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాల్‌కోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి కృష్ణమాచార్యులు, కోశాధికారి రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నాంపల్లి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శనివారం నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్ డివిజన్‌లో పర్యటించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. డివిజన్‌లోని వీర్‌నగర్‌లో రూ.29 లక్షలతో నిర్మించిన అంబేద్కర్ వాలీబాల్ క్లబ్ కమ్యూనిటీ హాల్, చింతలబస్తీ, కురుమ బస్తీలో బోర్‌వెల్‌ను ప్రారంభించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, అంబేద్కర్ వాలీబాల్ క్లబ్ అధ్యక్షుడు ఆత్మకూరి క్రాంతి కిరణ్, ప్రధాన కార్యదర్శి మహేంద్ర, కోశాధికారి గౌతమ్ చందన్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న కస్టమ్స్ కమిషనర్ ప్రసాద్

గన్‌ఫౌండ్రీ: సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ అండ్ జీఎస్టీ శాఖ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సెంట్రల్ జీఎస్టీ కస్టమ్స్ కమిషనర్ ప్రసాద్ అడెల్లి అన్నారు. శనివారం ఆదర్శ్ నగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో అఖిల భారత ఫెడరేషన్ ఆఫ్ కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ అండ్ జీఎస్టీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 16వ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులంతా కలిసి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్ సర్కిల్‌లో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 150 మంది ఉద్యోగులు ఉన్నారని, వారి కుటుంబాలలో నుంచి ఒకరికి ఉద్యోగం కేటాయించాలని కోరారు. అనంతరం ఉత్తమ సేవలు కనబరచిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు సదానందం, ప్రధాన కార్యదర్శి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.